Namasthe telangana - Dt:- 28/8/2015

# పీపుల్స్ ఫ్రెండ్లీ నగరంగా తీర్చిదిద్దుదాం

## మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి




ప్రసంగిస్తున్న మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

నమస్తే తెలంగాణ, సిటీబ్యూరో: మెరుగైన ప్రజారవాణా వ్యవస్థలతోనే స్మార్ట్ నగరాలను నిర్మించుకోగలమని హైదరాబాద్ మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రజల అవసరాలకు సరిపోయే ప్రజా రవాణా వసతులను అవలంబించాలని కోరారు. సీఎం కేసీఆర్ ప్రతిపాదించిన విశ్వనగరంగా అభివృద్ధి చేయడంలో భాగంగా ప్రజా రవాణాపై దృష్టిపెట్టారని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని పీపుల్స్ ఫ్రెండ్లీ నగరంగా తీర్చిదిద్దుకుందామని పిలుపునిచ్చారు. నెక్స్ట్‌జెన్ స్మార్ట్ సిటీపై బుధవారం మారియట్ హోటల్‌లో ఏర్పాటుచేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. నగరాలు కార్ల కోసం నిర్మించరాదని, మహిళలు, పిల్లలు, వృద్ధుల అవసరాల కోసం నిర్మించుకోవాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. నగరంలో ప్రస్తుతం 35 లక్షల వాహనాలు తిరుగుతున్నాయని.. ప్రతీ ఏడాది 3- 4 లక్షల వాహనాలు పెరుగుతున్నాయని. వాహనాల సంఖ్య పెరుగుతుండటంతో నగర ప్రజలు నడవడానికే స్థలం లేకుండా పోతోందన్నారు. మెట్రోరైల్ ప్రాజెక్ట్ బహుళ ప్రయోజనాలున్న రవాణాసాధమని, ప్రాజెక్ట్‌తో నగర స్వరూపమే మారిపోనుందరన్నారు. మెట్రోరైల్ కారిడార్లలో భాగంగా స్కూళ్లు, హాస్పిటళ్లు, కార్యాలయాలు, ప్రైవేట్ సంస్థలకు చేరుకునేలా సైడ్‌వాక్‌లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. స్టేషన్లను స్థానికంగా ఉన్న సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా నిర్మిస్తున్నామన్నారు. రైల్వే, ఎంఎంటీఎస్, ఆర్టీసీ బస్సులతో మెట్రోరైల్‌ను అనుసంధానిస్తున్నామన్నారు. అనంతరం హెచ్ఎంఆర్ ఎండీని సంస్థ ప్రతినిధులు మెమెంటోతో అభినందించారు.

Sakshi

Dt 28/05/15

## అన్ని ప్రాంతాలూ

# 'మెట్రో'తో అనుసంధానం

సాక్షి,సిటీబ్యూరో: నగర సంస్కృతి, వారసత్వాన్ని ప్రతిబింబించేలా మెట్రో స్టేషన్లను తీర్చిదిద్దనున్నట్లు హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. మెట్రో స్టేషన్లను బస్టాపులు, రైల్వే, ఎంఎంటీఎస్ స్టేషన్లతోపాటు సమీప కార్యాలయాలు, ఆస్పత్రులు, షాపింగ్ మాల్స్‌కు సైడ్‌వాక్స్, స్కైవాక్స్ (నడిచే దారులు,ఆకాశ వంతెనలు)తో అనుసంధానిస్తామన్నారు. నూతన తరం స్మార్ట్‌సిటీస్ అన్న అంశంపై నగరంలోని మారియట్ హోటల్‌లో బుధవారం నిర్వహించిన ఓ సదస్సులో ఆయన కీలకోపన్యాసం చేశారు. మెట్రో స్టేషన్ల నుంచి సమీప కాలనీలకు చేరుకునేందుకు వీలుగా మెట్రో గో అరౌండ్ బస్సులను నడపనున్నామని చెప్పారు. ప్రధాన రహదారులపై 8 అడుగుల విస్తీర్ణంలో స్థలాన్ని వినియోగించుకొని అదే స్థలంలో పిల్లర్లు, వయాడక్ట్ సెగ్మెంట్లు, మెట్రో కారిడార్లు, స్టేషన్లు ఏర్పాటు చేయడం ఇంజినీరింగ్ అద్భుతమన్నారు. ఒక్కో మెట్రో ట్రాక్ ఏడు బస్సు మార్గాలు, 24 కారు మార్గాలతో సమానమన్నారు. నిత్యం 35 లక్షల వాహనాలు నగర రహదారులను ముంచెత్తుతున్నాయని, ఏటా మరో నాలుగు లక్షల వాహనాలు ఈ జాబితాలో చేరుతుండడంతో ట్రాఫిక్ నరకంతో నగరవాసులు విలవిల్లాడుతున్నారన్నారు. మెట్రో ప్రాజెక్టుతో ట్రాఫిక్ ఇక్కట్లు సమూలంగా తీరనున్నాయని తెలిపారు.




ప్రసంగిస్తున్న ఎన్వీఎస్‌రెడ్డి